సంస్మరించుకుందాం

# కామ్రేడ్ మధుకు అరుణారుణ జోహార్లు



**సిపిఐ (ఎం-ఎల్)** కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యులు, 'క్లాస్ స్ట్రగుల్ 'పత్రిక సంపాదకులు కామ్రేడ్ మధు 2021 ఏప్రిల్ 16న మరణించారు. మూడవ వర్ధంతి సందర్భంగా ఆ కామ్రేడ్‌కు విప్లవ జోహార్లు అర్పిస్తూ సంస్మరించు కుందాం.

మార్క్సిజం లెనినిజం మావో ఆలోచనా విధాన పతాకాన్ని దృఢంగా ఎత్తి పట్టిన కామ్రేడ్ మధు, మితవాద, అతివాద, అరాచకవాద ధోరణులకు తొణకకుండా, పార్టీ మౌలిక అవగాహన దృక్పథానికి అనుగుణంగా సంఘర్షణ సాగించారు. ఆంతరంగికంగా ఉద్యమ క్రమంలో తలెత్తిన అనేక ఒడిదుడుకులలో, అనివార్యమైన బాహ్య, ఆంతరంగిక సిద్ధాంత, రాజకీయ సంఘర్షణలో కామ్రేడ్ మధు దృఢంగా నిలిచారు. అవకాశవాద రాజకీయాలను రాజీలేకుండా వ్యతిరేకించారు.

కామ్రేడ్ మధు నిత్య అధ్యయనశీలి. సిద్ధాంత గ్రంథాలను, పార్టీ కార్యక్రమాన్ని కార్యకర్తలకు వివరించడంలో తనదంటూ ప్రత్యేకమైన శైలితో ఆకర్షించేవారు. మన రాష్ట్రంలో జరిగిన కార్యకర్తల రాజకీయ అధ్యయన తరగతుల్లో, కామ్రేడ్ మధు ముఖ్యమైన భూమికను పోషించారు.

కామ్రేడ్ మధు అత్యవసర పరిస్థితి కాలంలో పార్టీ ఆంతరంగిక పత్రిక 'జ్వాల' బాధ్యతలు నిర్వహించారు. తెలుగు, ఇంగ్లీష్ భాషలలో పార్టీ పత్రికల ప్రచురణలో, ముఖ్యంగా 'జనశక్తి' నిర్వహణలో కామ్రేడ్ మధు ముఖ్యమైన పాత్ర పోషించారు. కామ్రేడ్ జస్వంత్ అమరులైన తర్వాత పార్టీ కేంద్ర పత్రిక 'క్లాస్ స్ట్రగుల్' సంపాదకత్వ బాధ్యతలు చేపట్టారు. రాజకీయ నివేదికలను రూపొందించడంలో, సిద్ధాంత సమస్యల పైన పార్టీ సమీక్షల తయారీలో కామ్రేడ్ మధు ముఖ్యమైన పాత్ర నిర్వహించారు. దేశీయ, అంతర్జాతీయ పరిస్థితులను విశ్లేషించడంలోనూ, వాటి పట్ల అవగాహన అందించడంలోనూ కామ్రేడ్ మధు సాగించిన రాజకీయ సిద్ధాంత కృషి ప్రత్యేకించి పేర్కొనదగింది.

తెలుగు సాహిత్య ఉద్యమంలో పరిణామాలను నిశితంగా పరిశీలించిన కామ్రేడ్ మధు, నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమ అవగాహన - సాంస్కృతికోద్యమ దృక్పథాన్ని సూత్రీకరించి అందించారు.

తిరుగులేని నిబద్ధత, నిమగ్నతలతో దాదాపు ఆరున్నర దశాబ్దాల సుదీర్ఘకాలం విప్లవానికి, విప్లవ రాజకీయాలకు ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు. విప్లవకారులుగా విడివడిన నాటి నుండి విప్లవోద్యమంలోని ప్రతి మలుపులో కామ్రేడ్ మధు ఒక ప్రముఖమైన పాత్ర నిర్వహించారు. ఆయన తన జీవిత కాలమంతా విప్లవ బాధ్యతలను, కర్తవ్యాలను చేపట్టి నిర్వహిస్తూ వచ్చారు. కామ్రేడ్ మధు త్యాగగుణం, నిష్టతో సాగించిన తీవ్ర కృషి ఎంతో స్ఫూర్తిదాయకం. నేటితరం కార్యకర్తలకు ఆదర్శప్రాయం.

ఈ కృషిని ముందుకు కొనసాగించడమే మన ముందున్న కర్తవ్యం. కామ్రేడ్ మధుకు జోహార్లు.

★★★★★